## విశ్రాంత ఉద్యోగుల పింఛన్ పెంచాలి




సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగులు

అంబర్‌పేట, మే 25 : స్టేట్ బ్యాంక్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం ఆదివారం స్థానికంగా జరిగింది. అసోసియేషన్ ప్రతినిధి ఉప్పు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో 1995 నుండి పింఛను పెంపు, భీమా సౌకర్యం తదితర అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయాలపై స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి సి.ఎన్. ప్రసాద్, అధ్యక్షుడు డా.అనంతకృష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శి వి.సోంబాబు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి కె. రోహిణిరావు, లక్ష్మారెడ్డి, కృష్ణమురళీ, ములినిరెడ్డి, రవికుమార్, రామకోటేశ్వర్ రావు, సాయిరెడ్డి, వి.కె. తివారి తదితరులు పాల్గొన్నారు.

## నీల మేఘ శ్యామ నృత్యరూపకం



ప్రశంసా పత్రాలతో నృత్యకారిణులు

రవీంద్రభారతి, మే 25: ప్రముఖ కూచిపూడి నృత్యకళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో గురు శ్రవ్యమానస ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుక సందర్భంగా దాదాపు 200 మంది విద్యార్థులు ప్రదర్శించిన నీల మేఘశ్యామ నృత్యరూపకం వీక్షకులను ఆకట్టుకున్నది. ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అంగరంగ వైభవంగా ఈ నృత్యరూపక ప్రదర్శన జరిగింది. కృష్ణ భగవానుని లీలామృతంలోని కొన్ని ముఖ్యఘట్టాలను గురు శ్రవ్యమానస భోగిరెడ్డి తన శిష్యబృందంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం ప్రత్యేక అధికారి, రిటైర్డ్ ఐఏఎస్ జి. కిషన్‌రావు, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మేనేజర్ డైరెక్టర్ కె.లక్ష్మి ఐఎఎస్), ప్రముఖ సినీ టీవీ దర్శక నిర్మాతలు, నటీనలు పాల్గొని కళాకారులందరినీ తమ అభినందనతో ఆశీర్వదించారు. గురు శ్రవ్య మానసనని, తన శిష్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కూచిపూడి నృత్య ప్రదర్శన మన పూర్వీకులు ప్రసాదించిన వరప్రసాదమని అన్నారు.కూచిపూడి నత్యాన్ని భావితరాలకు ఒదించాల్సిన బాధ్యత నాట్యగురువులపై ఉందన్నారు. ఈ సందర్భంగా భోగిరెడ్డిని అభినందించారు.సంస్థ పక్షాన గురు శ్రావ్య మానస అతిథులందరినీ ఉచిత రీతీన సత్కరించారు. గురు, శ్రవ్య మానస వందన సమర్పణతో నీలమేఘవ్యామ ప్రదర్శన అంగరంగ వైభవంగా ముగిసింది.

# నాలాల్లో పూడిక తీస్తారా తియ్యరా?

- ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులు
- బీఆర్‌ఎస్ నేత ఆనంద్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, మే 25: వర్షాకాలం ప్రారంభమైనా నాలాల పూడిక తీత పనులు ప్రారంభించక పోవడం జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. మూడు నెలలుగా నాలాల, కచ్చా మోరీల పూడికతీత పనులు ప్రారంభించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆయన ధ్వజమెత్తారు. ఓ గంటసేపు వర్షం కురిస్తే గోషామహల్ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధమై అల్లా కల్లోలంగా మారిపోతుందని, ప్రధాన రోడ్లపై వరద నీరు నిలిచిపోయి కుంటలు, చెరువులను తలపిస్తాయని, ఇక వర్షాకాలంలో వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా మారి, లోతట్టు ప్రాంతాలు, బస్తీలు, కాలనీలోని ఇండ్లలోకి వరద నీరు చేరి పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. ఆదివారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. వేసవికాలంలో గంటసేపు వర్షం కురిస్తేనే నియోజకవర్గంలోని పుత్లి బౌలి పత్తర్ కీ మసీద్, గురుద్వారా, జగ్జీవన్ రామ్ నగర్, గౌలిగూడ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, చుడి బజార్, ఉస్మాన్‌గంజ్, తోప్ఖాన రిసాల అబ్దుల్లా, అరవ బస్తీ, చాక్నవాడి, బేగంబజార్, మచ్చి మార్కెట్, దారుస్సలామ్, దూల్ పేట్ తదితర ప్రాంతాలన్నీ వరద నీటితో స్విమ్మింగ్ పూల్స్‌ను తలపించాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వేసవి కాలానికి మూడు నెలల ముందుగానే మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌ల తృత్వంలో నాలా పూడిక తీత పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, టెండర్లను ఆహ్వానించి వర్షాకాలంలో గా పూడిక తీత పనులు చేశామని గుర్తు చేశారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ తో కలిసి పాదయాత్ర చేసి ఏం ఉద్ధరించారని ఆయన ప్రశ్నించారు. గోషామహల్ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో వరద నీటి కారణంగా నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన అందరూ బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## జూ పార్క్‌కు పోటెత్తిన సందర్శకులు



ఆదివారం సదర్శకులతో కళ కళ లాడుతున్న జూపార్క్



ఎంక్లోజర్ వద్ద ఖడ్గ మృగాన్ని తిలకిస్తున్న పర్యాటకులు

చార్మినార్, మే 25: జంతు ప్రదర్శన శాల (జూ పార్క్) ఆదివారం సదర్శకులతో కళ కళ లాడింది. వేసవి కాలపు సెలవులు కావడం తో ఆహ్లాదపు వాతావరణాన్ని ఆస్వాదించడానికి భారీగా సందర్శకులు జూపార్క్‌నకు తర లి వచ్చారని అధికారులు తెలిపారు. దీనితో జూ లోని జంతువుల ఎంక్లోజర్‌లు పర్యాటకులతో నిండిపోయాయి. ఆదివారం సుమా రు 24వేల పైచిలుకు పర్యాటకులు జూ ను సందర్శించారని అధికారులు తెలిపారు.

## కరాటేలో అక్కా, చెల్లెలు వరల్డ్ రికార్డ్



వరల్డ్ రికార్డ్ సాధించిన అక్కా, చెల్లెళ్లతో కార్పొరేటర్లు మహాలక్ష్మి, అమృత, డాక్టర్ గోపాల్ రెడ్డి తదితరులు

కాచిగూడ, మే 25 : విదేశాల్లోనూ తెలంగాణ కరాటే విద్యార్థులు సత్తా చాటాలని హిమాయత్‌నగర్, నల్లకుంట కార్పొరేటర్లు మహాలక్ష్మి, అమృత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జీవీఆర్ కరాటే అకాడమీలో ఆదివారం అ క్కాచెల్లెలు జి.అమృతారెడ్డి, జి.ఘన సంతోషినిరెడ్డి 11 నిమిషాల్లో పూర్తి చేయాల్సిన కరాటే ప్రదర్శన కేవలం 9:36 నిమిషాల్లో పూర్తిచేసి, 121 మెలుకువలను 11 విభాగాలు ప్రదర్శించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బింగి నరేందర్‌గౌడ్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి లయన్స్ విజయలక్ష్మి ధృవీకరించి అక్కాచెల్లెళ్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత యాదవ్, మొండ మార్కెట్ కార్పొరేటర్ దీపిక,సమాచార హక్కు మాజీ కమిషనర్ ఖలీలొద్దీన్, వివేక్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 6 నుంచి రేణుక ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



వివరాలు వెల్లడిస్తున్న దేవాలయ కమిటీ ప్రతినిధులు

అంబర్‌పేట, మే 25 : వచ్చే నెల జూన్ 6 నుంచి 8 వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంబర్‌పేట, శంకర్‌నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ ముత్యాలమ్మ, శ్రీనల్లపోచమ్మ దేవతామూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ రావుల ప్రదీప్, అధ్యక్షుడు ఎ.బ్రహ్మాచారి, గౌరవాధ్యక్షుడు కె. శివరామకృష్ణ(రాజు), ప్రధాన కార్యదర్శి టి.సతీశ్, కోశాధికారి ఇ. పూర్ణచందర్, ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ గుప్త, ఆర్గనైసింగ్ సెక్రటరీలు కచ్చిగళ్ల శ్రీనివాస్, మురళీకుమార్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, సభ్యులు ఎం. బల్‌దేవవ్‌సింగ్, ప్రతాప్‌రెడ్డి, దీపు, బస్తీ పెద్దలు శ్రీహరి, జయరాములు, నర్సింలు, యాదయ్యగౌడ్ తదితరులు విగ్రహ ప్రతిష్టాపన వివరాలపు ఆదివారం మీడియాకు తెలిపారు. జూన్ 6వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఊరేగింపు, సాయంత్రం 5.30కు గణపతిపూజ, పుణ్యాహవచనము, దీక్షాస్వీకారం, రక్షాబంధనం, అంకురార్పణ ఉంటుందన్నారు. జూన్ 7వ తేదీన ఉదయం 8 గంటల నుంచి శాంతి పాఠము, మూలమంత్ర హోమాలు, వాస్తు పూజ, సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణం, హోమం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జూన్ 8వ తేదీన ఆదివారం ఉదయం 7 గంటల నుంచి శాంతి పాఠం, హోమం, మహాపూర్ణాహుతి, మహా కుంభ సంప్రోక్షణ, అనంతరం రేణుక ఎల్లమ్మ(జమదగ్ని) శాంతి కల్యాణం, పండిత సన్మానం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అలాగే జూన్ 10వ తేదీ మంగళవారం అమ్మవార్లకు బోనాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## రాజ్యాధికారంతోనే బీసీలకు న్యాయం



'ఆధునికీకరణ-ప్రత్యామ్నాయం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దేవేందర్‌గౌడ్, జస్టిస్ వి.ఈశ్వరయ్య

రవీంద్రభారతి, మే 25 : దేశంలో కాని తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని, బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ అన్నారు. అనాధి నుంచి నేటి ఆధునిక కాలంలో కూడా 80 శాతం ఉన్న బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని దేవేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో చేతి వృత్తుల 'ఆధునికీకరణ-ప్రత్యామ్నాయం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. దేవేందర్‌గౌడ్ సభా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జాతీయ వెనుకబడిన తరగతుల మాజీ చైర్మన్ జస్టిస్ వి. ఈశ్వరయ్య, ఢిల్లీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఇనుకొండ తిరుమలి, హైకోర్టు న్యాయవాదులు అమీర్‌శెట్టి దేవేందర్, సామాజిక ఉద్యమకారుడు హైకోర్టు న్యాయవాది నాగుల శ్రీనివాస్‌యాదవ్ విచ్చేసి చేతివృత్తుల పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వక్తలు దేవందర్‌గౌడ్, జస్టిస్ ఈశ్వరయ్యలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నూటికి 80 శాతం ఉన్న బీసీలకు రాజ్యాంగ ఫలాలు అందడంలేదని చెప్పారు. 5శాతం లేని అగ్రకులాలు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని అన్నారు. అగ్రకులాల పల్లకీలకు బోయలుగా బీసీలు మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో రెండ్లు, ఆంధ్రప్రదేశ్‌లో 3 శాతం లేని కమ్మకులస్తులే పరిపాలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని బీసీలకు ఎవరి వాటా వారికి పంచుతామని చెబుతున్నాడే తప్పా ఆచారణలో పాటించడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి




రెడ్‌బిల్డింగ్ నుంచి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వెళ్తున్న వాహనాలు

అంబర్‌పేట, మే 25 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ నుంచి మల్లికార్జుననగర్ మీదుగా వినాయకనగర్ చౌరస్తా వరకు రోడ్డు పై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తుండటంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ రోడ్డును ఆనుకొని మూడు స్కూళ్లు, ఒక హాస్పిటల్ ఉందన్నారు. స్కూల్ పిల్లలు ఇదే రోడ్డు నుంచి ప్రయాణం సాగిస్తారని తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

## పొదుపే బంగారు భవిష్యత్‌కు బాట



శ్రీ గాయత్రీ పొదుపు సంఘం వార్షికోత్సవం పాల్గొన్న సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 25: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శకాలనీ శ్రీ గాయత్రీ పొదుపు సంఘం 25వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భావన రుషి ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి జమ ఖర్చుల పట్టిక, ఆదాయ-వ్యయాల వివరాలు, ఆస్తులు, బాధ్యతలపై పూర్తి నివేదికను చదివి వినిపించారు. అధ్యక్షుడు శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు విషయాలపై చర్చించి ఆమోదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామిలు మాట్లాడుతూ ఈ సంఘం 2000లో కేవలం నలుగురు సభ్యులతో ప్రారంభమై గత 25 సంవత్సరాల్లో 640 మంది సభ్యులతో బలమైన సంస్థగా ఎదిగిందన్నారు. 60 ఏళ్లు నిండిన సభ్యులకు వడ్డీతో పాటు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నామన్నారు. పొదుపే బంగారు భవిష్యత్తుకు పునాది అనే నినాదంతో సంఘం ముందుకు సాగుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీలోని శ్రీ గాయత్రీ పొదుపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దశపతి భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ఏర్వ కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా దశపతి రాజు, గాజుల సురేష్, కోశాధికారిగా గుర్రం తిరుపతమ్మ, సభ్యులుగా అదెట్ల బాలరాజ్, అదెట్ల నరేష్, గంజి రాజేశ్వరి, సగ్గం మహేందర్, ముదిగొండ సత్యానారాయణ, కూడికల ప్రభాకర్, మేకల సాయి కిశోర్, వర్కాల శ్రీశైలం, మసిని వనజలను ఎన్నుకున్నారు.

## అజంతా రైల్లో స్నాచింగ్

కాచిగూడ, మే 25: అజంతా రైల్లో ఆదివారం దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరికి చెంది కె. అనంతలక్ష్మి (53) అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గ మధ్య ఔరంగాబాద్ రైల్వే స్టేషన్‌లో అనంతలక్ష్మి మెడలో ఉన్న 31 గ్రాముల బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండగులు గొంగిలించారు. దీంతో బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం ఔరంగాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.


## హత్యా యత్నం

చార్మినార్, మే 25: రౌడీ షీటర్ పై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ మొహమ్మద్ సాబీర్ (30) ఆటో మెకానిక్ గా పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి వెళ్లడానికి సిద్ధమైన సాబీర్‌ను సమీపించిన గుర్తు తెలియ ని వ్యక్తులు కత్తులతో అతనిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అతనికి తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితున్ని చికిత్స నిమ్మిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల నేపథ్యంలోనే దాడులు జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఫుట్ పాత్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, మే 25: అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి ఫుట్ పాత్ పై మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (45) ఆదివారం సాయంత్రం హర్రస్‌పెంటలోని గ్రేవీ యార్డ్ సమీపంలో గల ఫుట్ పాత్ పై అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు కాచిగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతిని కుడి చేతిపై త్రిశూలం పుట్టుమచ్చ కలిగి ఎత్తు 5.0 ఉన్నట్లు తెలిపారు. నీలిరంగు ప్యాంటు, గ్రే రంగు చొక్క, ధరించి ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వివరాలకు 8712 660545 లో సంప్రదించాలని కోరారు.

## ఆర్టీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్టీసీలో అక్రమంగా కొనసాగుతున్న ఉద్యోగ సంఘంపైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు స్వామి, గడ్డం తిరుపతి

జియాగూడ, మే 25 : పది సంవత్సరాలుగా సంఘాన్ని రెన్యువల్ చేయకుండా ఎన్నికల నిర్వహించకుండా అక్రమంగా సంఘాన్ని కొనసాగిస్తున్న, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు స్వామి, కరీంనగర్ జోనల్ కన్వీనర్ గడ్డం తిరుపతిలు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అఫ్జల్‌గంజ్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు, ఆదివారం అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, బట్టు స్వామి, జి తిరుపతిరెడ్డి లు మాట్లాడుతూ.. ఈ సంఘానికి అధ్యక్షుడిగా కొనసాగుతున్న కే కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్రీనివాస్, కోశాధికారిగా హెచ్ మధుసూదన్, కే నాగయ్యలు, సంఘాన్ని రెన్యువల్ చేయకుండా ఎలాంటి ఆడిటింగ్ లేకుండా సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టాలకు వ్యతిరేకంగా ఈ సంఘాన్ని అక్రమ పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు, టీజీ ఆర్టీసీ మేనేజ్మెంట్ సైతం ఈ రెన్యువల్ కాని సంఘానికి చెందిన, నాయకులకు కార్యక్రమాలకు అనుమతినిస్తున్నారని, వారు ఆరోపిస్తున్నారు, 2015 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు, ఈ సంఘాన్ని కత్తుల యాదయ్య, తన పేరు మీదుగా రిజిస్ట్రేషన్ చేయించాడని, తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత తిరిగి సంఘాన్ని టీఎస్‌గా, మార్చి దాని సంబంధించిన పత్రాలను కృష్ణకు అందజేశానని తెలిపారు, నిబంధన ప్రకారం ప్రతి సంవత్సరానికోసారి సంఘాన్ని రెన్యువల్ చేయాల్సి ఉన్నప్పటికీ 10, సంవత్సరాలుగా ఎలాంటి రెన్యువల్ చేయకుండా అక్రమ పద్ధతిలో సంఘం కొనసాగించడం తనకు ఎంతో బాధ కలుగుతుందని ఆవేదం వ్యక్తం చేశారు, రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వాలు, చందాల పేరుతో రసీదులను ముద్రించి లక్షలాది రూపాయలు అక్రమ పద్ధతిలో వసూలు చేస్తున్నారని ఈ విషయాన్ని తాము ప్రశ్నిస్తే సంఘం నుంచి బహిష్కరించారని ఆరోపించారు, ఈ సంఘంలో కొనసాగుతున్న కోర్ కమిటీ సభ్యులు ఎన్నిసార్లు సంఘాన్ని రెన్యువల్ చేయాలని చెప్పినప్పటికీ వారి మాటలను లెక్కచేయకుండా ఇష్టానుసారకంగా సంఘానికి కృష్ణ కొనసాగిస్తున్నారని వారు తీవ్ర సాయి ఆగ్రహం వ్యక్తం చేశారు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 12వేల ఎస్సీ, ఎస్టీ, కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, దానిపైనే మా పోరాటమని తెలిపారు, వీరి అక్రమ దందాపై గతంలో ప్రశ్నించిన బీబీ సింగ్ ను రామ్మూర్తిని నిజాంబాద్ రీజినల్ సెక్రెటరీ మధులను సంఘం నుంచి బహిష్కరించారని గుర్తు చేశారు, అక్రమంగా కొనసాగుతున్న ఈ సంఘం కార్యవర్గం నాయకులు కే కృష్ణ, గడ్డం శ్రీనివాస్ మధుసూదన్, కే నాగయ్యల పై చర్యలు తీసుకోవడంతో పాటు చట్టపరంగా వారిని శిక్షించాలని, ఈ విషయమే ఆర్టీసీ ఎండీ, సజ్జనార్‌కు, అఫ్జల్ గంజ్ ఇన్స్పెక్టర్ రవికుమార్ లకు పూర్తి ఆధారాలతో లిఖిత, పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## బడిబయట బడీడు పిల్లలు ఉండకుండా..

- జూన్ 6 నుంచి 19 వరకు బడి బాట..
- సర్కారు బడుల్లో సౌకర్యాలపై ప్రచారం
- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు కార్యాచరణ సిద్ధం




జూబ్లీహిల్స్, మే 25: ప్రభుత్వ పాఠశాలల్లో జూన్ 6 నుంచి 19 వరకు 'బడిబాట' కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం (2025-26) లో అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఎప్పటిలాగే జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో బడి బాట కార్యక్రమం చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

బడి బాట కార్యక్రమంలో భాగంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలతో, ఎన్‌జీఓలు, వలంటీర్లతో కలిసి ఉపాధ్యాయులు బస్తీల బాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనంతో పాటు ప్రధానంగా నాణ్యమైన విద్యపై విస్తృతంగా ప్రచారం చేయనున్నారు.

### బస్తీలు, కాలనీల్లో క్యాంపెయిన్లు

ఈ ఏడాది బడిబాట కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. 1 నుంచి 5 తరగతులలో అడ్మిషన్లు భర్తీ చేసేందుకు ఉపాధ్యాయ బృందాలు పాఠశాల చుట్టుపక్కల ఉన్న బస్తీలు, కాలనీల్లో ర్యాలీలు, క్యాంపెయిన్లు నిర్వహిస్తారు. సర్కారు బడుల్లో అందుతున్న సౌకర్యాలపై ప్రచారం నిర్వహిస్తారు. బడికి దూరంగా వున్న పిల్లలను గుర్తించి స్థానిక పాఠశాలలో అప్పటికప్పుడు అడ్మిషన్లు ఇస్తాం. అందరికీ విద్య అందించే లక్ష్యంతో బడి బయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకుంటాం. - శ్రవణ్ కుమార్, డిప్యూటీ ఐఓఎస్

## సెల్‌ఫోన్ దుకాణాలపై పోలీసుల దాడి

అబిడ్స్, మే 25 : ఆపిల్ ఐఫోన్ డూప్లికేట్ పరికరాలను విక్రయిస్తున్న సెల్ ఫోన్ దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున ఆపిల్ డూప్లికేట్ పరికరాలను ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగదీష్ మార్కెట్ లో గల మాతాజీ, ఆర్జీ మొబైల్స్, రాజారాం, న్యూ డ్రీమ్స్ సెల్‌ఫోన్ దుకాణదారులు ఆపిల్ కంపెనీకి చెందిన డూప్లికేట్ పరికరాలను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్లు అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ఎస్సై గౌరేందర్ గౌడ్ నేతృత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఆపిల్ కంపెనీ చెందిన పలు పరికరాలు ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

## పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ, మే 25 : కేంద్ర ప్రభుత్వం బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లను కల్పించాలని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలి అడ్డ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 56% బీసీలు ఉంటే ప్రభుత్వ రంగంలో 12 శాతం, ప్రైవేట్ రంగంలో 6 శాతానికి మించి లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగంలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఇప్పటికీ న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భూషణ్ భాస్కర్, పి. కృష్ణ, డాక్టర్ ప్రశాంత్ నేమ్ కర్, సత్యపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపు సమస్యలకు పరిష్కారం



వరద నీటి కాలువ పనులపై అధికారులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, మే 25 : ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నట్లు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద కాలువల నిర్మాణంతో పటేల్ చెరువుకు అనుసంధానించి ఉపశమనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పటేల్ కుంట చెరువు సమీపంలో నూతనంగా నిర్మించబోయే కాలువ నిర్మాణ పనులపై అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఇప్పటికే వరద నీటి కాలువల నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా మురుగునీరు చెరువులలోకి చేరకుండా నివారించి, వర్షపు నీటితో చెరువులు కళకళ లాడేలా చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలం లోగా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.